క్లుప్తంగా

ఎక్సైజ్ తనిఖీలు



వాజేడు : మండల పరిధిలోని పలు కిరాణ దుకాణాలపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కిరాణ షాపుల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఈ దాడులను నిర్వహించినట్లు తెలిసింది. మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. పలు దుకాణాలను తనిఖీ చేసినప్పటికి ఎలాంటి మద్యం లభించలేదన్నారు.

ఏజెన్సీ దళితులకు భూమి హక్కు కల్పించాలి



వెంకటాపురం(కె) : ఏజెన్సీలో దళితులు సాగు చేస్తున్న భూమిపై హక్కు కల్పించాలని నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఈశ్వర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బెస్తగూడెంలో నేతకాని హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రధాన పార్టీలు తమ మేనిఫెస్టోలో ఏజెన్సీ దళితులకు భూమి హక్కులు ప్రకటించకపోవడం బాధకరం అన్నారు. ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనేతరులకు ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం నర్సింహారావు, నవీన్, సత్యనారాయణ, సమ్ము ఉన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి : ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మేరీ మట్టి.. మేరా దేశ్ అమృత్ కలశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు.ఈ భూమ్మిద మానవుడు ఎంత విధ్వంసం సృష్టించిన భూతల్లి తన పొత్తిళ్లలో దాచుకుంటుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కొమ్మాల సంధ్య, రాములు నాయక్, కిషన్, భిక్షం, శ్వేత, రాజ్‌కుమార్, అశోక్, శ్రీలత, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

మల్హర్: విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సంపత్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి అపరాధ రుసుం బారిన పడకుండా చూసుకోవాలని కోరారు. బిల్లులను గూగుల్ పే, ఫోన్‌పే తదితర ఆన్‌లైన్ యాప్‌ల్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ మేనిఫెస్టో

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ఎజెండగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించడం జరిగిందని మంథని ఎమ్మెల్యే, పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీధర్‌బాబు హాజరై మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ఆరుగ్యారంటీ స్కీంలను రూపొందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు చేసింది శూన్యం అని బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ స్కీంలు, మేనిఫెస్టోను కాపీ కొట్టి బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటించారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవారికి ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో అవినీతికి పాల్పడిన నాయకుడు ప్రస్తుతం బీఆర్ఎస్ ఉన్నాడని అన్నారు. సాగు, తాగునీరు అందించడం కోసం తాము మంజూరు చేసి మొదలు పెట్టిన చిన్న కాళేశ్వరం పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికి పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చ జరగాలి తప్ప హత్యలపై కాదని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, బాన్సోడ రాణిబాయి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, చీర్ల తిరుమల, నాయకులు కొట్టె ప్రభాకర్, ఆంగోతు సుగుణ, ఎలుబాక సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం మండల కేంద్రంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్‌కు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చీమల సత్యం, దుర్గారావు, మరికొంత మందితో పాటుగా చిద్నెపల్లి, బొప్పారం, మద్దిపల్లి, మేడిపల్లి, జాదారావుపేట, మహాముత్తారం మండలం మీనాజీపేటకు చెందిన సుమారు వంద మంది పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

‘ఆరు గ్యారంటీ’లతో బీఆర్ఎస్‌లో వణుకు



నినాదాలు చేస్తున్న నాయకులు

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను కార్యకర్తలు, నాయకులు ప్రతి గడప గడపకు తీసుకపోవాలని అన్నారు. గండ్ర సత్యనారాయణరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు దొడ్డి కిష్టయ్య, సాద రమేష్, శరత్‌బాబు, పర్లపెల్లి రవి, సమ్మయ్య, ప్రభాకర్, నాగరాజు, కాల్వ లక్మారెడ్డి, సతీష్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, సాయికృష్ణ, భద్రయ్య, రవి పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కామిడి సతీష్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని హనుమకొండలో నిర్వహించిన జాతీయ స్థాయి అబ్దుల్‌కలాం టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా రేగొండ మండలంలోని రామన్నగూడెం తండా ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న కామిడి సతీష్‌రెడ్డి జాతీయ అవార్డును అందుకున్నాడు. ఉమ్మడి జిల్లా లేబర్‌కోర్టు జడ్జి వై.సత్యేంద్ర, సీనియర్ సూపర్ ఇంటెంట్ ఆఫ్ యస్ యస్ కోర్టు అంజనీకుమారి, అవార్డు పౌండర్ వునిశెట్టి రవికుమార్, అవోప జిల్లా గవర్నర్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి సేవలను గుర్తించి ప్రశంస పత్రంతో పాటు శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సతీష్‌రెడ్డి 66 సార్లు రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ కవిగా, రచయితగా వ్యాసకర్తగా , సామాజిక కార్యక్రమాలు చేస్తూనందుకుగాను అవార్డుతో పాటు సన్మానించినట్లు తెలిపారు. సతీష్‌రెడ్డి అవార్డు అందుకోవడంపై గ్రామ సర్పంచ్ బిక్యా నాయక్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రామచంద్రన్‌ను కలిసిన వైద్యులు



సన్మానిస్తున్న వైద్యాధికారులు

భూపాలపల్లి రూరల్: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకులు రామచంద్రన్‌ను సోమవారం జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు హైదారాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానం చేసినట్లు భూపాలపల్లి మండల అసోసియేషన్ కోశాధికారి, మండల పశువైద్యాధికారి తిరుపతి తెలిపారు. కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు డి.శ్రీదేవి, పవన్‌రెడ్డి, రాజబాబు, శ్రీరాం, అభిషేక్, మైథిలి, మహతితో పాటు తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

కాటారం: ఉద్యోగాల క్రమబద్ధీకరణ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ ఉద్యోగులు మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో సుమారు 22 వేల మంది 18 ఏళ్లుగా ఆయా హోదాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్నట్లు శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. అర్హతలు కలిగి ఉన్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేదని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తమను రెగ్యులర్ చేసేలా మేనిఫెస్టోలో పొందుపర్చాలని శ్రీధర్‌బాబును కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగుల సహదేవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, సభ్యులు రాజు, తిరుపతిరెడ్డి, నాగరాజు, సుదర్శన్, ప్రసాద్, శ్రీవాణి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ ప్రత్యేక పూజలు

మంగపేట: మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని తహసీల్దార్ బైరి వీరస్వామి దర్శించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి సారిగా ఆలయానికి వచ్చిన తహసీల్దార్ దంపతులు, బంధువులకు ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వయంభు స్వామివారికి తహసీల్దార్ దంపతుల గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టతను, ఆలయ పురాణాన్ని వివరించి స్వామివారు, అమ్మవార్ల శేషవస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆర్ఐ కుమార స్వామి, జూనియర్ అసిస్టెంట్ నందకిశోర్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వెంకటాపురం(కె) : కాచి చల్లార్చిన నీటినే ప్రజలు తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లాపురం, కొండాపురం, చిరుతపల్లి తదితర గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, స్థానికులు తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సంఘానికి గుర్తింపు



సెమినార్‌లో పాల్గొన్న కోసరి గోపాల్

శాయంపేట : ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని ప్రజ్వల్ రైతు కోసరి గోపాల్ అన్నారు. మండలంలోని వసంతాపూర్‌లో సోమవారం జరిగిన అంతర్జాతీయ ఐడీహెచ్, బీసీఐ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీఐ వారి ఆర్థిక, డబ్ల్యూడబ్ల్యూఎస్ ఇండియా సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్నటువంటి బీసీఐ, హెచ్ అండ్ఎం ప్రాజెక్టు కార్యక్రమాల గురించి పాల్పంచుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ వై ఇన్నారెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై నమ్మకంతోనే చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం : బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకంతోనే పలువురు పార్టీలో చేరుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు అన్నారు. సోమవారం మండలంలోని రొయ్యూర్, శంకరాజుపల్లి గ్రామాల బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షులు కురుమ శ్రీనివాస్, ఆత్కూరి రాంబాబు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మూడు మండలాల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, లక్ష్మీనర్సింహారావు కలిసి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేసిందని, అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. బీజేపీకి చెందిన వంద మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కూనూరు మహేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, శేఖర్, సందీప్, రొయ్యూరు సర్పంచ్ సమతఈశ్వర్, ఎంపీటీసీలు జాడి లక్ష్మీనారాయణ, కోట నరసింహులు, తిరుపతి, కూనూరు చిరంజీవి, ఉపసర్పంచ్ అల్లంల చంటి, దేవులపల్లి సమ్మయ్య, నూకల లక్ష్మీనారాయణ, ఎండి వలీబాబా, తాడూరి రఘు, మెరుగు వెంకటేశ్వర్లు, గండేపల్లి నర్సయ్య, రామకష్ణ, ఎండి ఆరిఫ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల హర్షం

శాయంపేట : స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ బీఫాం అందించిన సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



మంగపేట: జిల్లా స్థాయి క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ఎస్సై రవికుమార్



ఏటూరునాగారం: క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రిన్సిపాల్

మంగపేట : క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్సై గోదరి రవికుమార్ అన్నారు. మంగపేట మండల యూత్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కమలాపురంలో రేఖా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఎస్సై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మంగపేట యూత్ నాయకులు పల్లపు రమేష్, అజ్మత్‌పాష, బండి రాకేష్, అన్వేష్, కల్యాణ్, నవీన్, చల్లా రాంకీ, ఖలీద్, యువజన నాయకుడు కొమరగిరి సురేష్, షణ్ముక్, వెంకటసాయి, సాయి తేజ పాల్గొన్నారు.

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని గురుకుల క్రీడా పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు అండర్-14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌గా నిలిచారు. సోమవారం మండల కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ప్రతిభ కనబర్చిన 75 మంది విద్యార్థులకు కళాశాల, పాఠశాల లెక్చరర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా ఇంచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ రీజనల్ 7వ జోనల్ స్థాయి క్రీడలలో ఏటూరునాగారానికి చెందిన క్రీడా పాఠశాల, కళాశాల విద్యార్థులు అథ్లెటిక్స్, వివిధ విభాగాల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తుమికి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని క్రీడల్లో గెలుపొంది పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఐటీడీఏ పీఓ అంకిత్, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మరిన్ని పతకాలను సాధిస్తామన్నారు. కళాశాల పీడీ రమణ, స్కూల్ పీడీ శ్రీను, బాక్సింగ్ కోచ్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్నానాలకు వెళ్లి నీట మునిగి ఇద్దరు మృతి

- అమ్మ ఆరోగ్యం బాగుండాలని అమావాస్య పూజలు..
- మహారాష్ట్ర వాసులుగా గుర్తింపు
- కాళేశ్వరం త్రివేణి సంగమంలో ఘటన
- మూఢనమ్మకాలతో ప్రాణాల మీదకు తెచ్చుకున్న వైనం..



రామేశ్వర్(ఫైల్)



సురేష్(ఫైల్)



ఇద్దరి మృతదేహాలు

కాళేశ్వరం: అమ్మ ఆరోగ్యం బాగాలేదని, నయమవడానికి భూతవైద్యుడితో కలిసి అమావాస్య రోజు పూజలు చేసేందుకు కాళేశ్వరం గోదావరిలో స్నానాలకు వచ్చిన ఇద్దరు నీటిలో మునిగి చనిపోయారు. ఈ ఘటన ఘటన మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరిలో చోటు చేసుకుంది.మృతులు మహారాష్ట వాసులుగా గుర్తించారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పరిధి రంధాంపేటకు చెందిన కోనం లక్ష్మీనారాయణ భార్య సుశీల కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో సిరొంచలో కొత్తగూడానికి చెందిన భూతవైద్యుడు చిలుముల సురేష్(32)ను ఆయన సంప్రదించగా కాళేశ్వరంలో త్రివేణి సంగమ గోదావరిలో అమావాస్య రోజు పూజలు చేసి రాత్రి నిద్ర చేస్తే నయం అవుతుందని తెలిపాడు. దీంతో లక్ష్మీనారాయణ, అతని భార్య, చిన్న కుమారుడు రామేశ్వర్(18)తో కలిసి ఈనెల 14న శనివారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్నారు. ఆ రాత్రి అమావాస్య సందర్భంగా సుశీలకు పూజల తంతును భూతవైద్యుడు నిర్వహించి కాళేశ్వరం దేవస్థానంలో నిద్రించారు. మరుసటి రోజు 15న ఆదివారం ఉదయం 9.30 గంటలకు సురేష్‌తో కలిసి రామేశ్వర్‌లు గోదావరిలో స్నానాలు చేసి వస్తామని వెళ్లారు. ఎంతకి తిరిగి రాకపోవడంతో లక్ష్మీనారాయణ సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా స్పందన లేదు. అచూకీ కోసం తిరిగి మళ్లీ 16న సోమవారం గోదావరి తీరంలో లక్ష్మీనారాయణ పెద్ద కుమారుడు నితిన్‌తో కలిసి వెతికారు. కాళేశ్వరం జాలర్లు రెండు మృతదేహాలు గోదావరి నీటిలో తేలియాడుతూ కనిపించినట్లు కాళేశ్వరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లక్ష్మణ్‌రావు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతులిద్దరు లోతు ప్రవాహానికి వెళ్లి నీటమునిగి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుల బట్టలు, సెల్‌ఫోన్‌లు తీరం వద్ద ఇసుకలో లభించాయి. మృతుడు సురేష్ తండ్రి గోపాల్, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. రామేశ్వర్ తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ రంగధాంపేట్‌లో ఆర్ఎంపీ వైద్యుడిగా పని చేస్తున్నాడు. మృతుడు రామేశ్వర్ సిరొంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా, వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందినప్పటికి మూఢనమ్మకాలతో అమావాస్య రోజు పూజలకు వచ్చి ఇద్దరి ప్రాణాలు మీదకు తెచ్చుకున్నారని పలువురు వాపోయారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు



వెంకటాపురం(ఎం): అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



ఏటూరునాగారం: రామాలయంలో..

గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొలువైన దుర్గాదేవి సోమవారం భక్తులకు బాలత్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ మేరకు వేదపండితుడు గోవర్ధన కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించగా మైత్రి వెంకన్న-స్వప్న దంపతులు పూజలో పాల్గొన్నారు. అమ్మవారికి చీర సారెలతో, నేవైద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాయత్రిదేవీగా అమ్మవారు..

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రిదేవీగా దర్శనమిచ్చారు. అర్చకులు ఎల్లప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయం, సాయిబాబా ఆలయం, క్రాస్‌రోడ్డు ఐటీడీఏ వద్ద, ముత్యాలమ్మ ఆలయం, శివాలయం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భవాని మాలధారులు భక్తి గీతాలను ఆలపించారు.

వెంకటాపురం(ఎం) : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో రెండో రోజు దుర్గామాత గాయత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు రఘునాథచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చింతిరెడ్డి రమణారెడ్డి, ముప్పు పూర్ణేందర్, పల్నాటి సురేష్, అక్కపెల్లి అరవింద్, పోశాల చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కార్మికుడి మృతి

గణపురం: విద్యుత్ శాఖ అన్‌మ్యాన్డ్ కార్మికుడు జనగాని కిరణ్(26) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం మండలంలోని అప్పయ్యపల్లి సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలుకాగా స్థానికులు వెంటనే కిరణ్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, కిరణ్ ఎల్‌సీ తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా జరిగి ఈ ప్రమాదం జరిగింది. సబ్‌స్టేషన్ ఆపరేటర్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగినట్లు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపడుతున్నారు. మృతుడు కిరణ్‌ది శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామం. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.